నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
శుక్రవారం 07
జూన్ 2024
పేజీలు 8
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు

# బొగ్గేరును తవ్వేస్తున్నారు..!

- నిత్యం ట్రాక్టర్లతో తరలింపు
- కాసులు కురిపిస్తున్న ఇసుక వ్యాపారం
- మామూళ్ల మత్తులో సెబ్ అధికారులు

**మర్రిపాడు (మేజర్ న్యూస్)** జిల్లా సరిహద్దు ప్రాంతమైన మర్రిపాడు మండలంలోని బొగ్గేరు నుంచి ఇసుక నిత్యం ట్రాక్టర్లతో తరలిపోతోంది. ఆయాపారస్తులకు కాసుల వర్షం కురిపిస్తుంది. ఈ రవాణాను అడ్డుకోవాల్సిన సెబ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉండడంతో వారి వ్యాపారానికి అవధులు లేకుండా పోతుంది. చివరకు రాత్రులు కూడా బరితెగించి బొగ్గెరు నుంచి రవాణాను సాగిస్తున్నారు. వివరాల్లోకెళ్తే...

మర్రిపాడు మండలంలో ఇసుక రవాణాకు సంబంధించిన వ్యాపారులకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. మండలంలో ప్రధానంగా బొగ్గేరు ఇసుక వరప్రసాదమైంది. దీనిని ఆసరాగా చేసుకున్న వ్యాపారస్తులు సంబంధిత అధికారులను లోపర్చుకొని రవాణాను యదేచ్చగా సాగిస్తున్నారు. మండల పరిధిలోని బూదవాడ కృష్ణాపురం పెగళ్లపాడు చిలకపాడు రాజులపాడు సన్నువారిపల్లి భీమవరం నందవరం రామానాయుడుపల్లి ప్రాంతాల నుంచి ఈ ఇసుక అక్రమ రవాణా యదేచ్చగా సాగుతోంది. ఒక్క ట్రాక్టర్ టక్కు ఇసుక ధర 3 వేల రూపాయల నుంచి 5000 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. అయితే వ్యాపారస్తులకు మాత్రం అక్కడ కూలీలకు పడే ధర కేవలం 1000 రూపాయలు మాత్రమే. దీంతో వ్యాపారస్తులు వేలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు అడ్డొస్తే ఎంతోకొంత అప్పజెప్పి పంపించి వారి రవాణాను యదేచ్చగా సాగిస్తున్నారు. దీంతో ఆ అధికారులు కూడా చూసి చూడనట్లు వెళ్తున్నారు. నిత్యం వ్యాపారం చేసే వ్యాపారస్తులు మాత్రం ప్రతి నెల మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం. ఆయా గ్రామాల పరిధిలో ఉండే సచివాలయాల్లో పన్ను రసీదులు కట్టి ఇసుకను తోలుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాంటి తరుణంలో ఎటువంటి పన్ను కట్టకుండా రవాణాను సాగిస్తున్న అధికారులు మౌనంగా ఉండడం విశేషం.

**సిమెంట్ ఇటుక వ్యాపారానికి కూడా..**

మర్రిపాడు మండలంలో సిమెంట్ ఇటుక వ్యాపారం కూడా జోరుగా నడుస్తోంది. ఈ వ్యాపారానికి కూడా ఇసుక ఎంతో ప్రధానమైనది. ఆ వ్యాపారస్తులు కూడా బొగ్గేరు ఇసుకను యదేచ్చగా తరలిస్తున్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఇసుకని తరలించుకుంటూ వ్యాపారాన్ని సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ సిమెంట్ ఇటుక బట్టీలు కృష్ణాపురం బూదవాడ మర్రిపాడు చుంచులూరు డిసిపల్లి ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ బట్టీలకు నిత్యం ఇసుక ఎంతో అవసరం. వ్యాపారం సాగాలంటే ఇసుక ఉండాల్సిందే. అలాంటి నేపథ్యంలో ట్రాక్టర్లతో ఈ వ్యాపారస్తులు ఇసుకను బొగ్గేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న సంబంధిత అధికారులు మౌనం దాల్చడం ఎంతో విడ్డూరంగా ఉందని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని ఈ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాల్సిందిగా పలువురు కోరుతున్నారు.





## అద్దె భవనంలో కునారిల్లుతున్న హాస్టల్



**అనంతసాగరం (మేజర్ న్యూస్)** మండల కేంద్రమైన అనంతసాగరంలోని బీసీ వసతి గృహం గత రెండు దశాబ్దాలు పైగా అద్దె భవనంలోనే కు నారిల్లుతోంది. వసతి భవనం కాలం చెల్లిన స్థితిలో ఉంటూ వర్షాకాలంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. భవన స్లాబు దీనాస్థితిలో ఉంటూ ఎప్పుడు పైపెచ్చులు పడతాయో తెలియని భయానక పరిస్థితులు నెలకొని ఉన్నాయి. మరుగుదొడ్లు సైతం అధ్వానంగా

మిగతా 2లో

## నెల్లూరు నగర రూపు రేఖలు మారుద్దాం..

- కోటంరెడ్డితో భేటీ అనంతరం మాజీ మంత్రి నారాయణ కామెంట్స్..
- కోటంరెడ్డి నివాసానికి వెళ్లి పుష్పగుచ్చం ఇచ్చిన కృతజ్ఞతలు తెలిపిన మాజీ మంత్రి నారాయణ.



2లో...

## కోటంరెడ్డి సోదరులు శభాష్

- 35 వేల మెజారిటీతో అద్భుత విజయం సాధించారు
- అభినందించిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్
- పూలమాలతో సన్మానించి విజయ చిహ్నంగా కత్తిని బహుకరించిన కోటంరెడ్డి సోదరులు



2లో...

## కళ్యాణ వైభోగమే

భక్తులతో కిటకిటలాడిన కళ్యాణోత్సవ ప్రాంగణం



2లో...

# నెల్లూరు రూరల్ నియోజకవర్గం

## అద్దె భవనంలో కునారిల్లుతున్న హాస్టల్

ఉన్నాయి. గతంలో వసతి గృహంలో 100 మంది కి పైగా విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం కేవలం 22 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారు. జిల్లా అధికారులు 2016లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపాన గల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. పక్కా భవన నిర్మాణానికి పలుమార్లు ప్రతిపాదనలు జరిగినప్పటికీ అవి కార్యాచరణకు నోచుకోలేదు. ఇకనైనా పక్క భవన నిర్మాణానికి అధికారులు చొరవ చూపాలని విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన జరగాలని సర్వత్ర కోరుతున్నారు.

## నెల్లూరు నగర రూపు రేఖలు మారుద్దాం..

**నెల్లూరు (మేజర్ న్యూస్)** అందరి సమిష్టి కృషితో నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీని తీసుకొచ్చామని మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ అన్నారు.. గురువారం మధ్యాహ్నం బాలాజీ నగర్ లో ఉన్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు నివాసానికి ఆయన వెళ్లారు.. కోటంరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి.. సిటీ నియోజకవర్గంలో భారీ మెజారిటీ వచ్చేందుకు ఎంతో కష్టపడ్డారని, ఐదేళ్లపాటు కార్యకర్తలని కాపాడారని నారాయణ అభినందించారు.. అనంతరం అరగంట పాటు నెల్లూరు నగర నియోజకవర్గం అభివృద్ధిపై చర్చించారు.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నెల్లూరు నగర రూపురేఖలు మారుద్దామని పొంగూరు నారాయణ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ తమ వైపే ఉన్నారని ఫలితాలు స్పష్టం చేశాయని.. ఈ ఫలితాలు వల్ల దేశం మొత్తం మన వైపే చూసిందన్నారు. అందరం ఐక్యంగా ఉంటూ నెల్లూరు జిల్లాని అభివృద్ధి పథంలో నడిపిద్దాం అన్నారు..కార్యకర్తల సంక్షేమం నిధిపై కూడా వారు చర్చించారు.. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థల విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## కోటంరెడ్డి సోదరులు శభాష్

**నెల్లూరు (మేజర్ న్యూస్ )**నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి అద్భుత విజయం సాధించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు ఉండవల్లిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తో గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేష్ ను పూలమాలతో సన్మానించి విజయ చిహ్నంగా కత్తిని బహుకరించారు. అనంతరం నారా లోకేష్ మాట్లాడుతూ కోటంరెడ్డి సోదరులను ప్రత్యేకంగా అభినందించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అద్భుత విజయం సాధించారని, హాట్రిక్ విజయం సాధించినందుకు అభినందనలు తెలియజేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

### శభాష్ అజీజ్ భాయ్...

### కష్టపడి పనిచేశారు... మీ కష్టం వృధా పోదు.

### - నారా లోకేష్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి



**నెల్లూరు సిటీ ( మేజర్ న్యూస్)**టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ఉండవల్లి లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేష్ అబ్దుల్ అజీజ్ ను ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. కష్టపడి పని చేశారని, అద్భుత ఫలితాలు సాధించామని నారా లోకేష్ అబ్దుల్ అజీజ్ ను అభినందించారు. మీరు పడ్డ కష్టం వృధా పోదని భరోసా కల్పించారు.

# కళ్యాణ వైభోగమే









**బుచ్చిరెడ్డిపాలెం( మేజర్ న్యూస్)** ముక్కోటి దేవతల సాక్షిగా పుణ్యమూర్తులు దంపతులు అయ్యారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులు పుణ్య దంపతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని జొన్నవాడలో కొలువుదీరిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి కళ్యాణం గురువారం కన్నుల పండువగా జరిగింది. అమ్మవారి పుట్టినిల్లు అయిన పెనుబల్లి నుంచి తలంబ్రాలతో వచ్చిన అర్చకులు గురువారం ఉదయం స్వామి అమ్మవార్లను అలంకరించారు. ఆలయం ఎదుట ఏర్పాటుచేసిన కళ్యాణ మండపంలోకి తొలుత వధువు కామాక్షితాయిని తీసుకొచ్చారు. ఒకరిపై మరొకరు గంధం చల్లుకుంటూ ఆనందోత్సవాల మధ్య మండపానికి వేంచేశారు. అనంతరం వరుడు మల్లికార్జున స్వామి ని కళ్యాణ మండపంలో కొలువు తీర్చారు. వేదమంత్రాల నడుమ మంగళ వాయిద్యాలు వాయిస్తున్న శుభ ఘడియలో కళ్యాణ మహోత్సవాన్ని పూర్తి చేశారు. వధూవరులు ముత్యాల తలంబ్రాలు పోసుకునే ప్రక్రియ కనుల పండుగగా సాగింది. కళ్యాణ మహోత్సవం చూడడం వేయి జన్మల పుణ్యఫలం అంటూ కళ్యాణ మహోత్సవ విశిష్టతను అర్చకులు వివరించారు. ఆలయ ఈవో గిరి కృష్ణ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలుగా నెల్లూరుకు చెందిన శ్రీ శక్తి ఆగ్రో ఆయిల్ అధినేత వల్లూరు రవీంద్ర కుమార్ రెడ్డి సంధ్యా దంపతులు వ్యవహరించారు. నెల్లూరు రూరల్ డిఎస్పి వీరాంజనేయ రెడ్డి బుచ్చిరెడ్డిపాలెం సిఐ హైమారావు కళ్యాణ మహోత్సవం సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ ఈవో గిరి కృష్ణ , ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.కళ్యాణ మహోత్సవ సందర్భంగా భక్తులు స్వామి అమ్మవార్లకు కళ్యాణ చదివింపులు మొత్తం 2,26,128 కానుకగా చదివించి మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

**పవిత్ర నదిలో పుణ్య దంపతుల విహారం:-**

వైభవంగా స్వామి అమ్మవార్ల తెప్పోత్సవం పవిత్ర పెన్నా నదిలో పుణ్య దంపతులు విహరించారు. జొన్నవాడలో శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పల్లకిలో తెప్ప వద్దకు తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పలో స్వామి అమ్మవార్లను కొలువు తీర్చారు. దేవదేవేర్లు తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. పెన్నా నదిలో విహరిస్తున్న పుణ్య దంపతులను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మారం రెడ్డి శ్రీధర్ రెడ్డి, మౌనిజమ్మ దంపతులు, బుచ్చిరెడ్డిపాలెం కి చెందిన పుట్ట లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు, లక్ష్మీకాంతమ్మ, నెల్లూరుకు చెందిన పచ్చిపాల వెంక రెడ్డి, ప్రమీలమ్మ దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. పెన్నా నది వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ హైమారావు పోలీసు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

# సందడిగా నారాయణ నివాసం





### - డాక్టర్ పొంగూరు నారాయణకు అభినందనల వెల్లువ

### - భారీగా తరలి వచ్చిన కూటమి శ్రేణులు

**నెల్లూరు సిటీ (మేజర్ న్యూస్)**20224 సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా డాక్టర్ పొంగూరు నారాయణ భారీ విజయాన్ని సాధించారు. ఈ సందర్భంగా నారాయణకి శుభాకాంక్షలు తెలిపేందుకు నెల్లూరులోని ఆయన నివాసానికి పెద్ద సంఖ్యలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ఈ క్రమంలో 72, 489 ఓట్ల అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను కలిసి అభినందనలు తెలియజేశారు. టీడీపీ ముఖ్యనేతలు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి శాలువాలు, పూలమాలలు, భారీగజమాలలు, బొకేలు, జ్ఞాపికలు, స్వీట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. తన విజయానికి కృషి చేసిన వారందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు. అభిమానుల తాకిడితో నారాయణ నివాసం జనసంద్రమైంది.

# కోవూరు నియోజకవర్గం

## 'పది' ప్రతిభామూర్తులకు అభినందనలు




బుచ్చిరెడ్డిపాలెం మేజర్ న్యూస్:-2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం "ఆపస్" ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాలెం బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాశాఖ అధికారులు ఎం.దిలీప్ కుమార్, పి.వి.రత్నం మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేయడం వల్లే మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం సుజాత, ఆపస్ జిల్లా అధ్యక్షులు కే. రాజగోపాల్, బుచ్చిరెడ్డిపాలెం మండల గౌరవ అధ్యక్షులు ఎం.రవి అధ్యక్షులు కే,హజరత్, ప్రధాన కార్యదర్శి పూల మల్లికార్జున పాల్గొన్నారు.

## ఆనం ను కలిసిన ఏఎస్పేట టిడిపి నేతలు



అనుమసముద్రంపేట మేజర్ న్యూస్ ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ని ఏ ఎస్ పేట మండలం టిడిపి నేతలు కార్యకర్తలు మర్యాదపూర్వకంగా నెల్లూరులోని ఆయన స్వగృహం నందు కలిశారు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లి ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డిని శాలువాలు కప్పి భారీ గజమాలతో సన్మానించారు అలాగే ఆత్మకూరు నియోజకవర్గం సీనియర్ టిడిపి నాయకులు తాళ్లూరు గిరినాయుడును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పిబొకేలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పేట మండల టిడిపి కన్వీనర్ అబ్బూరు రమేష్ నాయుడు మండల నాయకులు ఏలూరు మాలాద్రి నాయుడు షేక్ ఖాదర్ బాషా షేక్ అఫ్జల్ మా భాష సురేష్ నాయుడు కొండమీద కొండూరు కుప్పురుపాడు హసనాపురం ఏఎస్పేట కావలి యడవల్లి తదితర గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## అక్రమ ఇసుక తరలింపును అడ్డుకున్న టిడిపి నాయకులు

మర్రిపాడు మేజర్ న్యూస్: మర్రిపాడు ఇసుక రిచ్ నుండి అక్రమంగా ఇసుక తరలుతున్న లారీలను మండల పరిధిలోని తిక్కవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గురువారం అడ్డుకున్నారు. ఇలా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ఆత్మకూరు శాసనసభ్యులుగా గెలుపొందిన ఆనం రామనారాయణ రెడ్డికి సమాచారం అందించగా వెంటనే ఆపేయనుమని ఆదేశాలు ఇవ్వడంతో వెంటనే టిడిపి నాయకులు సెబ్ అధికారులకు సమాచారం అందించారు. ఈ తరుణంలో సెబ్ అధికారులు వచ్చి 4 లారీలు, 3 ట్రాక్టర్లు, 1 హిటచి మిషన్ ను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మీ సహకారం మరువలేనిది...





**- అందరికి అండగా ఉంటా**

**- శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక దంపతులను కలిసిన నారాయణ**

**- పుష్పగుచ్చాలు అందచేసిన నారాయణ**

నెల్లూరు సిటీ (మేజర్ న్యూస్)2024 ఎన్నికల్లో డాక్టర్ పొంగూరు నారాయణ గెలుపు కోసం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మంత్రి తాళ్లపాక రమేష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనూరాధలు ఎంతో కృషి చేశారని, ఈ సందర్భంగా పొంగూరు నారాయణ, నారాయణ విద్యా సంస్థల ఏజీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డిలు నెల్లూరులోని శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక నివాసాలకు వెళ్లి పుష్పగుచ్చాలు అందచేసి ప్రత్యేకంగా అభినందించారు. నా విజయానికి కృషి మీరెంతో కష్టపడి పని చేశారని, శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక దంపతుల్ని నారాయణ ప్రత్యేకంగా అభినందించారు. ఎల్లప్పుడూ మీకు నేను అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఇదే విధంగా ఐదేళ్లపాటు మనమందరం కలిసి నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు.

# ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీలకు చంద్రబాబు అభినందనలు



**- పాల్గొన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

నెల్లూరు (మేజర్ న్యూస్)రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీలతో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో నెల్లూరు ఎంపీగా ఘన విజయం సాధించిన శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిగారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుగారితో మాట్లాడారు. సమావేశంలో పాల్గొన్న వేమిరెడ్డి.. వివిధ అంశాలపై చంద్రబాబు నాయుడుగారితో ప్రత్యేకంగా చర్చించారు. ఎన్నికల్లో గెలుపొందిన వారికి చంద్రబాబు నాయుడుగారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భేటీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడుగారు, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, విశాఖ ఎంపీ భరత్, విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ ఇతర ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

# టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేష్‌తో వేమిరెడ్డి దంపతుల భేటీ





నెల్లూరు , (మేజర్ న్యూస్)ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు.. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం అమరావతికి చేరుకున్న వారు.. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు గారిని ప్రత్యేకంగా కలిశారు. నెల్లూరు జిల్లాలో ఎంపీగా, ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన వేమిరెడ్డి దంపతులను చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌గారు ప్రత్యేకంగానా అభినందించారు. చంద్రబాబు నాయుడుగారు, నారా లోకేష్‌ను కలిసిన వారిలో నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

# ఆనంను కలిసిన ఆరికట్ల, శాఖమూరి

మర్రిపాడు మేజర్ న్యూస్: ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆనం రామనారాయణ రెడ్డిని గురువారం మర్రిపాడు మండల టిడిపి అధ్యక్షులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు, మాజీ మండల అధ్యక్షులు శాఖమూరి నారాయణలు తన సొంత నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం ఇచ్చి సంతోషం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో జరిగిన సార్వత్రికఎన్నికల్లో దశాబ్దల తర్వాత ఆత్మకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఆనం హయాంలో ఎగరవేయబడిందన్నారు. ఆత్మకూర్ నియోజకవర్గంలోని ప్రజలకు పార్టీలతో ప్రమేయం లేకుండా అందరి శ్రేయోభిలాషి కోరే ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు శాసనసభ్యులుగా ఘనవిజయం సాధించారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గమే కాకుండా రాష్ట్రంలో తిరుగులేని విజయం టిడిపికి దక్కిందన్నారు. అనంతరం మర్రిపాడు అభివృద్ధి గురించి చర్చించారు.



# ఆత్మకూరులో అంబరాన్నంటిన సంబరాలు





### -ఆనం విజయం అపూర్వమంటూ కోలాహలం

### -ఆకాశాన్నంటిన భాణాసంచా

### -నేతలు,కార్యకర్తల కేరింతలు

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఘనవిజయం సాధించడంతో బుధవారం ఆత్మకూరు పట్టణంలోని బిఎస్ఆర్ సెంటర్‌లో ఆపార్టీ నాయకులు, బిజెపి,జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. తొలుత విజయోత్సవకేక్‌కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం డిజెసౌండ్స్‌తో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున కేరింతలు కొడుతూ అంబరాన్నంటేలా సంబరాలు జరుపుకున్నారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడుతూ 3దశాబ్దాల తరువాత ఆత్మకూరులో తెలుగుదేశం జెండా రెపరెపలాడిందని, ఈ పరిణామం ఆనంకే సాధ్యమైందని పేర్కొన్నారు. ఆత్మకూరులో అభివృద్ధిప్రధాత, సీనియర్,సమర్థత కలిగిన నేత ఆనం రామనారాయణరెడ్డి విజయం అత్యంత చారిత్ర్యాత్మకం, ఆవశ్యకం, అనితరసాధ్యమని ఆయన పేర్కొన్నారు. అనంతరం వారంతా విజయోత్సాహంతో ఆకాశానికి చిల్లులుపడేలా పెద్దఎత్తున బాణాసంచా, తారాజువ్వలతో గంటపాటు మోతమోగించారు. అభిమానులు విరివిగా ఈ కార్యక్రమంలో పాల్గొని తిలకించారు. నాయకులు,కార్యకర్తలు అనే తేడా లేకుండా అందరూ కేరింతలుకొడుతూ తెలుగుదేశం పాటలతో హెూరెత్తించారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్, బిజెపి రాష్ట్ర నాయకుడు కుడుముల సుఆకర్‌రెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, మండల,పట్టణ టిడిపి ప్రధానకార్యదర్శులు కేతా విజయభాస్కరరెడ్డి, పల్లవోలు జయాకర్, జిల్లా టిడిపి అధికారప్రతినిధి చంద్రా వెంకటసుబ్బానాయుడు, జిల్లా తెలుగురైతు కార్యదర్శి మద్దినేని నారాయణ,మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ షేక్ సర్దార్, జిల్లాతెలుయువత నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, టిడిపి నాయకులు ఇందూరు వెంకటరమణారెడ్డి,ఖాదర్‌బాషా,సూరా భాస్కరరెడ్డి(కౌన్సిలర్), గంధళ్ళ వేణు(కౌన్సిలర్), గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, నలిశెట్టి శ్రీనయ్య, వల్లూరు వెంకటరమణారెడ్డి, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, దోర్నాదుల సురేష్‌బాబు, తోట సుబ్బారావు, పొన్నూరు హజరత్తయ్య, కోటేశ్వరి, గోరీషబ్బీర్, తోడేటి వెంకటయ్య, వడ్లమూడి వజ్రమ్మ, పయ్యావుల మారుతీనాయుడు, ప్రభాకర్‌నాయుడు, మాదాల మస్తాన్‌నాయుడు, దాసరి మధుసూధనరావు, పాలేటి శేషారెడ్డి, తాటిపర్తి పెంచలయ్య, ప్రవీణ్, కాపా వెంకటసుబ్బయ్య, దాసరి బాలకృష్ణ, హయత్‌బాషా, నాగభూషణమ్మ, మంగమ్మ, కొండ్రెడ్డి రమణారెడ్డి, ఖాజావలి, కొత్తపల్లి రమేష్, కొప్పోలు చిన్నపురెడ్డి, తుమ్మల కొండారెడ్డి, ఖాజామస్తాన్, , పలువురు టిడిపి, బిజెపి,జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలునాటిపెంచడం భావితరాలకు ప్రయోజనకరం



### -సిడిపివో సునీలత

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** మొక్కలు విరివిగా నాటి పెంచడం భావితరాలకు అత్యంత ప్రయోజనకరమని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పేర్కొన్నారు. ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆత్మకూరు పట్టణంలోని తమ కార్యాలయ ఆవరణలో విరివిగా మొక్కలునాటారు. ఈసందర్భంగా సునీలత మాట్లాడుతూ పర్యావరణదినోత్సవ స్ఫూర్తితో తమ కార్యాలయ ఆవరణలో విరివిగా మొక్కలు నాటుతామని, బాధ్యతాయుతంగా ప్రత్యేకశ్రద్ధతో వాటిని పెంచుతామని, తగిన భధ్రతతో పరిరక్షిస్తామని, ఆవరణంతా పచ్చదనం చేస్తామని పేర్కొన్నారు. మొక్కలను అధికంగా నాటిపెంచితే వాతావరణ సమతుల్యత, పర్యావరణం పరిరక్షింపబడతాయన్నారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఆమె పేర్కొన్నారు. మొక్కలు విరివిగా నాటితే ఆహ్లాదకరంగా ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. సమాజంలోని అన్నివర్గాల ప్రజలు తమకు అవకాశం ఉన్నచోట్లంతా విరివిగా మొక్కలు నాటి పెంచాలని, దాంతోపాటు అధికంగా ఆవరణలో వివిద రకాల నీడనిచ్చే., పండ్ల మొక్కలను నాటి పెంచాలని , మొక్కలను దత్తతతీసుకొని పెంచేలా కృషిచేయాలని సునీలత పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎం.రత్నమ్మ, ఎన్.కేశవనారాయణమ్మ, ఎన్.నాగేశ్వరి, కస్తూరి, విజయలక్ష్మి, పద్మావతి, సురేఖ, పద్మ,రమాదేవి,సుబ్బరత్నమ్మ, సిబ్బంది కరీమా, జ్యోతి, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## "ఆనం"ను అభినందించిన నిత్యాన్నదాత "కంచి"



**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా ఘన విజయం సాధించిన మాజీ మంత్రి, తెలుగుదేశం నాయకుడు ఆనం రామ నారాయణరెడ్డిని ఆత్మకూరుకు చెందిన పారిశ్రామికవేత్త, శ్రీసాంబశివచారి టబుల్‌ట్రస్ట్ చైర్మెన్, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి లభినందించారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు రామనారాయణరెడ్డిని శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి అభినందనలు తెలిపారు. రామనారాయణరెడ్డికి మంత్రిపదవి వరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు, ఏఎంసి మాజీ చైర్మెన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, కంచి సామాజిక సేవాకార్యక్రమాలు పర్యవేక్షకులు మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి, తెలుగుభారతిసేవాసమితి ప్రతినిధి సోమవరపు యానాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాల పంపిణీకి సర్వం సిద్ధం

### ఎంఈఓ 2 కాటంరెడ్డి



**అనంతసాగరం (మేజర్ న్యూస్)** అనంతసాగరం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను త్వరలో పంపిణీ చేస్తామని. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ 2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన అనంతసాగరంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠ్యపుస్తకాలు గ్రేడింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఒకటవ తరగతి నుండి పదో తరగతి వరకు 21937 పాఠ్యపుస్తకాలు వివిధ పాఠశాలలకు పంపిణీ చేయాల్సి ఉందని రెండు రోజుల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

# ఆత్మకూరు నియోజకవర్గం

## ఆనం కు అభినందనలు తెలిపిన కొండ్రేడ్డి



**నెల్లూరు (మేజర్ న్యూస్ )** ఆత్మకూరు నియోజకవర్గం శాసన సభ్యులు గా ఎన్నికైన ఆనం రామనారాయణ రెడ్డి ని రెడ్డి సంఘము జిల్లా అధ్యక్షులు కొండ్రేడ్డి రమణారెడ్డి అభినందనలు తెలియజేశారు. గురువారం మర్యాద పూర్వకము గా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధి ప్రధాత, మాజీ మంత్రి వర్యులు అయినా ఆనం రామనారాయణ రెడ్డి ని గెలిపించుకోవడం చాలా సంతోషం గా ఉందన్నాను. గ్రామాలను అభివృద్ధి చేయాలంటే అది ఒక్క ఆనం రామనారాయణ రెడ్డి కే తెలుసుఅన్నారు.రానున్న రోజుల్లో ఆత్మకూరు నియోజకవర్గం రూపు రేఖలు మార్చానున్నానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తీర్చాగలిగే సత్తా ఆనం రామనారాయణ రెడ్డి కే ఉందన్నారు.అనంతరం నువ్వూరుపాడు గ్రామం లో సంబరాలు చేసుకొంటూ, బాణ సంచాలు పేలుస్తూ,విజయోత్సవ కేక్ ని కట్ చేసి అందరికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోకేష్‌కు అభినందనలు

## తెలిపిన "పుట్టం", "కిలారి"





**మర్రిపాడు,మేజర్‌న్యూస్:** తెలుగుదేశం జాతీయ ప్రధానకార్యదర్శి, మాజీ మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్‌బాబును గురువారం ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు అభినందనలు తెలిపారు. ఇటీవల ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన లోకేష్‌ను రాష్ట్ర తెలుగుదేశం ఆర్గనైజింగ్ కార్యదర్శి పుట్టం బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ టిడిపి నాయకుడు కిలారి సుబ్రహ్మణ్యంనాయుడులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

# ఉదయగిరి నియోజకవర్గం

# వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి విజయానికి కృషిచేసిన నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు : వంటేరు వేణుగోపాల్ రెడ్డి

## కాకర్ల సురేష్ కు అభినందనలు తెలుపుతున్నా రామారావు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి.



**కలిగిరి, జూన్ 5 (సూర్య ):** తొలిసారి కూటమి ఎమ్మెల్యే గా బరిలో నిలబడి 9556 ఓట్ల మెజార్టీ సాధించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ను తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి బి.వి.రామారావు గురువారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.వింజమూరు క్యాంప్ ఆఫీసులో జరిగిన సన్మాన కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూఎమ్మెల్యే కాకర్ల సురేష్ గెలుపే ధ్యేయంగా పనిచేసిన టిడిపి, జనసేన, బిజెపి, నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదములు తెలిపారు. కాకర్ల ట్రస్టు ద్వారా ఆయన చేసిన సేవా కార్యక్రమాలే ఆయన విజయానికి దోహదం చేశాయన్నారు. మంచి హృదయం గల మంచి మనిషికి ఉదయగిరి టిడిపి పగ్గాలు అప్ప చెప్పారని. రానున్న రోజుల్లో ఉదయగిరి రూపురేఖలు మారుస్తారన్నారు. ఎన్నికల ముందు ప్రజల కు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని 20 సంవత్సరాలు పాటు ఉదయగిరి గడ్డపై తెలుగుదేశం పార్టీ జెండాను నిలుపుతారంటూ ఆయన ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో పెద్ద కొండూరు గ్రామ కమిటీ అధ్యక్షులు వెల్లంకి కొండప నాయుడు,258 బూత్ కన్వీనర్ మొక్క హాజరత్ రావు, బొల్లినేని సురేంద్ర. పెద్ద కొండూరు గ్రామపంచాయతీ సంబంధించిన టిడిపి నాయకులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారా లోకేష్ ని కలిసిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**వింజమూరు మేజర్ న్యూస్**ఉదయగిరి నియోజకవర్గం నుంచి అద్భుత విజయం సాధించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కాకర్ల ప్రవీణ దంపతులు ఉండవల్లిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నీ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నారా లోకేష్ కాకర్ల సురేష్ ను అభినందించారు. ఉదయగిరి నియోజకవర్గంలో అద్భుత విజయం సాధించారని, వైసిపి కంచుకోటను బద్దలు కొట్టినందుకు, మునుపెన్నడూ లేని మెజార్టీ సాధించినందుకు అభినందనలు తెలియజేశారు. ఉదయగిరి అభివృద్ధికి సంబంధించి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజాక్షేత్రంలో ప్రజలకు సేవలు అందించి సేవకుడిగా నిలిచి, ఉదయగిరిని అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. ముందుగా కాకర్ల దంపతులు కనకదుర్గ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవి ఆశీస్సులు అందుకున్నారు. కాకర్ల సురేష్ వెంట ఆయన కుమార్తె కాకర్ల దాత్రి ఉన్నారు

**జలదంకి మేజర్ న్యూస్ :-** 2024 లో జరిగిన ఎన్నికల్లో నెల్లూరు ఎంపి తెదేపా అభ్యర్థిగా పోటీచేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గెలుపుకోసమే కాకుండా అత్యధిక మెజార్టీ వచ్చేందుకు కృషిచేసిన జిల్లాలోని టిడిపినాయకులకు, కార్యకర్తలకు అభివందనలు తెలిపారు. అదే విధంగా 2019లో జరిగిన ఎన్నికల్లో జలదంకి మండలం నుండి వైకాపాకు 9వేల పై చిలుకు మెజార్టీ వచ్చిందని అయితే 2024లో జరిగిన ఎన్నికల్లో మెజార్టీని దాదాపు తగ్గించడానికి కృషిచేసిన మండల టిడిపి నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో కూడా ఇదే ఉత్సహంతో పనిచేసి స్థానిక సంస్థల్లో అన్నింటిలో గెలుపొందాలని ఆయన సూచించారు.



## ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్లను కలిసిన ఏపీ ఎన్జీవోఎస్ అధ్యక్షులు మధు



**వింజమూరు మేజర్ న్యూస్** ఉదయగిరి తెలుగుదేశం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ను ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు వెలుగోటి మధు వింజమూరు మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావులో మర్యాదపూర్వకంగా కలిశారు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు హృదయపూర్వకంగా ఆయనను అభినందించారు ఈ సందర్భంగా ఆయన ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు కాకర్ల సురేష్ తన విజయానికి కృషి చేసిన వారిని అభినందించారు

## సోమిరెడ్డి ని కలిసిన చల్లా బ్రదర్స్



**వింజమూరు మేజర్ న్యూస్** మాజీ మంత్రివర్యులు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని గురువారం నాడు వింజమూరు మండల నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, చల్లా శీను, మైనార్టీ సెల్ అధ్యక్షులు మహబూబ్ భాష కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నెల్లూరు నగర ఎమ్మెల్యే పొంగూరు నారాయణను కలిసిన డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి





**నెల్లూరు క్రైం (మేజర్ న్యూస్)**నెల్లూరు నగర ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించిన డాక్టర్ పొంగూరు నారాయణ గారిని నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణకి డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం పలు విషయాలపై కాసేపు మాట్లాడుకున్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థలు జియం విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా విందేటమ్మ తిరునాళ్ళు



**వింజమూరు మేజర్ న్యూస్** వింజమూరు పట్టణానికి నైరుతి దిశగా కొండపై వెలసియున్న శ్రీ వింధ్య పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం పార్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు ఉదయాన్నే గంగిరెడ్డిపాలెం భక్తులు ఉదయకర్తలుగా అమ్మవారి కార్యక్రమానికి పూజా సామాగ్రిని బాణాసంచాల మధ్య మంగళ వాయిద్యాలతో ఆలయానికి చేర్చారు అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం జరిపించి పూజా కార్యక్రమాలు జరిపించారు. అమ్మవారిని సర్వాంగ సుందరంగా సర్వాలంకరణ భూషితరాలుగా చేసి పల్లకిపై అధిష్టింప చేశారు పల్లకి నీ ఆలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణం గావించారు అమ్మవారి పల్లకిని మోసేందుకు భక్తులు పోటీపడ్డారు భక్తులు అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తదనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పైడాలరామిరెడ్డి, ఎత్తవు శ్రీనివాసరెడ్డి, కురుకుంట్ల శ్రీను, పో రెడ్డి నాగిరెడ్డి, సురా భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## టిడిపి అధినేతతో కోటంరెడ్డి సోదరుల భేటీ





**నెల్లూరు (మేజర్ న్యూస్)**తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యి నారా చంద్రబాబు నాయుడుకి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నెల్లూరు రూరల్ లో మంచి మెజార్టీతో గెలుపొందినందుకు చంద్రబాబు నాయుడు కోటంరెడ్డి సోదరులను అభినందించారు.

APPSC
TSPSC
పరీక్షల ప్రత్యేకం

# ఎదురుచూపులు వీడి.. ఎగ్జాంకి ప్రిపేర్ కండి..!

**ఎర్రటి ఎండాకాలం. సూరీడు నడినెత్తికి రాకముందే నడివీధులు నిప్పులు చెరుగుతున్నాయి. మధ్యలో అప్పుడప్పుడూ పలకరించి వెళ్ళే వేసవి మామిడి చిరుజల్లులు (మాంగో షవర్స్) (మొన్న ఎ.పి.పి.ఎస్.సి. గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో ఈ ప్రశ్న వచ్చింది) సరే, లోకంలో పాపం పెరిగినప్పటికినీ సృష్టిధర్మం ప్రకారం వానలు కురవవలసిందే. కాకపోతే ఎల్‌నినో ప్రభావం వల్ల సమయానికి ఋతుపవనాలు రాక రైతన్నలు, చెట్టూ, చేమా, పిట్ట పిచ్చుక, పశువులు వాన కొరకు ఎదురు చూస్తున్నాయి.**

ఇప్పుడు మనం చెప్పుకున్నవారు ఒక్కరే వానలకు ఎదురు చూడడం లేదు. ఇంకా చాతపక్షులు అని ఉంటాయి. అవి ఎంత దప్పికగా ఉన్నా కరిమబ్బుని పొడిచి పొడిచి నీళ్ళు తాగుతాయే తప్ప మరే ఇతర నీళ్ళు ముట్టుకోవు. అందుకనే మనందరికన్నా ఎక్కువగా వాన నీళ్ళ కొరకు చాతపక్షులు ఎదురు చూస్తుంటాయి. అవి ఎంగిలి పడిన తరువాతే మనకు వర్షం కురుస్తుంది.

**నిరంతరం ఎదురుచూపులే....**

నిజానికి మనిషి బ్రతుకు కూడా నిరంతరం ఎదురుచూపులే. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు ఐదేళ్ళు నోటిఫికేషన్‌ల కొరకు ఎదురుచూడాల్సి వచ్చింది. కష్టపడి ప్రిలిమ్స్‌ని గట్టెక్కించారు. తెలంగాణా రాష్ట్రంలో అయితే గ్రూప్-2, గ్రూప్-1 పరీక్షలు రాయడానికి ఉద్యోగార్థులు ఇంకా ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

**విలువైన కాలాన్ని హరిద్దామా...?**

ఇక, ఆంధ్రప్రదేశ్‌లో అయితే కొంతమంది ఉద్యోగార్థులు ప్రిపరేషన్ సరిగ్గా చేయడం లేదు. ఎన్నికల ఫలితాల కొరకు ఎదురుచూస్తున్నారు. ఆ ఆలోచనలతో చదువుని పక్కన పెట్టేశారు. ఎన్నికల ఫలితాలూ వస్తాయి, నాయకులూ వస్తారు, పాలకులూ అవుతారు. అది అలా జరిగిపోతుంది. కానీ మనం ఈ మధ్య ఎదురుచూపులలో పడి విలువైన కాలాన్ని హరిద్దామా?
ప్రజాస్వామ్యంలో అందం ఏంటంటే, ఓటు వేసిన వారందరికీ తెలుసును తాము ఎవరికి ఓటు వేశామో! కానీ మళ్ళీ అందరూ కలిసి ఎవరు గెలుస్తారా అని ఎదురు చూస్తుంటారు. జరగవలసింది జరగక మానదు, ఫలితాలు అనే సినిమా కోసం ఇప్పటినుండి ఉన్న పనులు మానేసి ప్రేక్షకులు వీక్షకులు అవుతామంటే కుదరదుగ కండి. జనాలు ఎదురుచూస్తారులేండి... కానీ పోటీ పరీక్షలకి ప్రిపేరయ్యే మనం ప్రిపేర్ కావాలిగదండి! ఒకసారి ఆలోచించండి.. ముందు మీరు చదవాలి.

**పరీక్ష వాయిదా పడుతుందా...?**

మళ్ళీ మనవాళ్ళు మరొకటి మొదలేశారు. ఎ.పి.పి. ఎస్.సి. గ్రూప్-2 మెయిన్స్ వాయిదా పడదా? అని. దీనికి ఎదురుచూపులే కావడం విశేషం. ఒకటి నిజం అవుతుందేమో? ప్రభుత్వం మారితే పరీక్ష కొద్దో గొప్పో వాయిదా పడవచ్చు. లేకపోతే జులై 28 ఖాయంగా జరగవచ్చు. కనుక ఎలక్షన్‌ల ఫలితాల కొరకు ఎదురు చూసి, పరీక్ష వాయిదా కొరకు ఎదురు చూస్తే జీవితం మొత్తం ఎదురు చూడవలసి వస్తుంది. అసలు పోటీ పరీక్షల్లో ఎదురుచూపులు వద్దు. ఏ రోజుకారోజు చదివి తీరవలసిందే.

జీవితంలో మనకు అత్యంత ముఖ్యమయిన వ్యక్తి కొరకు లేదా సంఘటన కొరకు ఎదురు చూస్తే తప్పు లేదు. ఆ వ్యక్తి వల్లనో లేదా ఆ సంఘటన వల్లనో మన మనసు సంతోషపడవచ్చు. అంతేకాదు ఇన్నాళ్ళు ఎదురు చూసాం, అమ్మయ్య ఇప్పటికి మనం అనుకున్నది జరిగింది అని ఆనందించవచ్చు. కానీ ఈ మొత్తం జర్నీలో మనం ఎంత ఆనందంగా ఉన్నామా లేదా అన్నది చాలా ముఖ్యం.

**సందేహాలు**



పోటీపరీక్షలకి ప్రిపేరయ్యే మీకు వందల సందేహాలు ఉంటాయి. ఈ సందేహాలతో జర్నీ చేస్తూనే, మరోపక్క ప్రిపేర్ అవుతుంటారు. ఆ సందేహాలలో అసలు జాబ్ వస్తుందా? అనేది మొదటి సందేహం. పేపర్ తేలికగా వస్తుందా? కఠినాతి కఠినంగా వస్తుందా? మరో సందేహం. పరీక్ష రద్దు అవుతుందా? ఇంకో సందేహం. పరీక్ష వాయిదానా? వేరొక సందేహం. ఈ సందేహాలను మూట కట్టి, అదిమిపట్టి, తొక్కినారతీసి, ఒకపక్కన పడేసి, సూటిగా సబ్జెక్టు ప్రిపరేషన్ చేయాలి. ఎవరయితే ఇలా చేయగలరో వారే విజేతలు అవుతారు.

**సందేహాలకి సమాధానం**

మీ సందేహాలకి నేను ఇపుడే సమాధానం చెపుతాను చూడండి.

**(1) అసలు జాబ్ వస్తుందా?**

- మీరు బాగా కష్టపడి లోతుగా చదివితే జాబ్ వచ్చి తీరుతుంది.

**2) పేపర్ కఠినంగా వస్తుందా? లేదా సులువుగానా**

- దానికి నా జవాబు మీరు, నేనూ దానికి జవాబు చెప్పలేం.కానీ విషయం (సబ్జెక్ట్)లోతుగా చదివినపుడు పేపర్ ఎలా ఉన్నా బాగా రాస్తారు.

**(3) పరీక్ష రద్దవుతుందా?**

- నా జవాబు - కాదు, రద్దు కాదు. రద్దు అనే సందేహం మీలో ప్రవేశిస్తే అసలు మీరు ప్రిపేరేషన్‌ని మానసికంగా సరిగ్గా చేయలేరు.

**(4) పరీక్ష వాయిదా పడుతుందా?**

- దీనికి ఇంతకుమునుపే జవాబు చెప్పుకున్నాం. కనుక సందేహాలు వీడి గట్టిగా మోత మోగిపోయేటట్లు చదవండి.

**అసలు పోటీ తక్కువే...**

సార్! ఉద్యోగాలు ఉన్నవే వేయి కదా! రాస్తుంది 90 వేల మందికి పైబడి కదా! మరెలాగ సారూ? అని మీరు అనవచ్చు. 90వేలమంది అనే అంకె మీకు పెద్దగా అనిపించవచ్చు. కానీ, ఇందులో గట్టిగా పోటీ ఇచ్చేవారు తొమ్మిది వేలమంది కూడా ఉండట్లేదు. అదీ కూడా ఒక్కో మార్కు తేడాతోనే జాబ్ కోల్పోతాం కనుక మీరు ఎంతగానో ఎదురుచూసిన గ్రూప్-2 మెయిన్స్ అయితే జరగబోతోంది. అలానే తెలంగాణలో గ్రూప్-2, గ్రూప్-1లు జరగబోతున్నాయి. సిద్ధంగా ఉండండి. ఎదురు చూడకండి. చదవండి.

బుద్ధుడన్నట్లు 'ఈ లోకంలో మనుషులు ఎల్లపుడూ ఏదోఒక దానికోసం ఎదురుచూస్తూనే ఉంటారు. అంటే కోరికలతో సతమత మవుతుంటారు' 'ఒకవేళ ఏవైనా ఎదురుచూపులు నెరవేరకపోతే ఆశ్చర్యపోవద్దు. దానినే మనం జీవితం అంటాం'. కానీ మనకు బతకడానికి వంద ఆప్షన్స్ ఉంటాయి. లోకంలో అందరూ ఏదో ఒక ఆప్షన్‌ని ఎంచుకొని బ్రతికేస్తున్నారు. కానీ అవకాశం ఉన్నపుడు మాత్రం అనుకున్న ఆప్షన్ కొరకు, సాధించే వరకు నిద్రపోవద్దు. ఇదెలాంటిదంటే 'ఈ ప్రపంచంలో నూటికి నూరుపాళ్ళు ఎవరినీ ఇష్టపడలేము. కానీ నచ్చిన విషయాన్ని పంచుకొని, నచ్చని విషయాన్ని తెంచుకొని ముందు కు పోవలసిందే! మనుషులుగా జన్మించాము కదా!'



హిస్టరీ రఫీ సార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238

**ఇక్ష్వాకుల కాలంలో 'శ్రీ'లు ఎవరు? ఏమి చేసారు?**

**1.శాంతిశ్రీ:** ఈమె వీరపురుషదత్తుడి మేనత్త. శ్రీశాంతమాలుడి సోదరి. ఈవిడ కుమార్తె శాంతిశ్రీని వీరపురుషదత్త వివాహం చేసుకున్నాడు. మేనత్తల కుమార్తెలను వివాహం చేసుకొనే ఆచారం ఈ వివాహంతోనే తెలుగునాట ప్రారంభమైంది.

**2.హార్మ్యశ్రీ:** వీరపురుషదత్తుడి మరో మేనత్త. ఈమె కుమార్తెలను కూడా వీరపురుషదత్త పెండ్లి చేసుకున్నాడు.

**3.చటిశ్రీ-బాపిశ్రీ:** వీరిరువురిని వీరపురుషదత్త పెండ్లి చేసుకున్నాడు. వీరిరువురు హార్మ్యశ్రీ కుమార్తెలు.

**4.అటవిశాంతిశ్రీ:** ఈమె వీరపురుషదత్తుడి సోదరి. ఈమె నాగార్జునకొండ వద్ద పారావతా విహారాన్ని పునరుద్ధరించింది.

**5.కొండబలిశ్రీ:** వీరపురుషదత్తుడి కుమార్తె. ఈమె మహిషాశకులు అనే బౌద్ధశాఖ బిక్షువులకి నాగార్జున కొండవద్ద బౌద్ధ విహారం నిర్మించింది.

**6.బోధిశ్రీ:** ప్రాచీన తెలుగునాట మొట్టమొదటి బౌద్ధ బిక్షుణి. ఇక్ష్వాకుల భాండాగారికుడు బోధిశర్మకి మేనకోడలు. రేవంతుడనే అమరావతి వ్యాపారవేత్త బిడ్డ. ఈమె యవ్వన ప్రాయంలోనే బౌద్ధాన్ని పుచ్చుకొని బౌద్ధమతాభివృద్ధికి నాగార్జునకొండ వద్ద సింహాళి బౌద్ధ విహారం నిర్మించారు. అనేక దానధర్మాలు చేసారు.

**7.ఎలిశ్రీ:** ఎహుబల శాంతమాలుడి మనవడు మరియు సేనాని ఎలిశ్రీ. ఇతను ఎహుబల శాంతమా లుడి 11వ రాజ్యపాలనాకాలంలో విజయపురి వద్ద సర్వదేవాధి దేవాలయం నిర్మించాడు. అంతేకాదు, ఏలేశ్వరం గట్టు అనే పట్టణాన్ని నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని కృష్ణానది దీవిలో ఈపట్టణం నిర్మించాడు. కానీ నాగార్జున సాగర్ నీళ్ళల్లో ఈ పట్టణం కలిసిపోయింది. అయితే ప్రస్తుతం ఎలిశ్రీ కట్టిన ఏలేశ్వరంలో కాత్యాయనీ సమేత మల్లిఖార్జునస్వామి దేవాలయం పూజలందుకుంటున్నది.

**8. నొదుకశ్రీ:** ఇక్ష్వాకులలో చివరిరాజు రుద్రపురుషదత్తుడు. (2018 గ్రూప్-2లో ఇది అడిగారు) ఇతని కాలంలోని సేనాని పేరు నొదుక శ్రీ. ఇతను గుంటూరు జిల్లాలోని నాగులాపురంలో ఉన్న హలంపురస్వామికి భూదానం చేసాడు.ఈ పరంగా నొదుకశ్రీ పేరు గాంచెను. ఈ భూ దానాన్ని ఇతను తనరాజు రుద్రపురుషదత్తుడి నాలుగవ పాలనా సంవత్సరాన చేయడం జరిగింది.

## సదస్సులు-సమావేశాలు

- కామన్‌వెల్త్ న్యాయవిద్యాసంస్థ కామన్వెల్త్ అటార్నీలు సొలిసిటర్ జనరల్స్ సదస్సు 2024 జనవరి 3న న్యూఢిల్లీలో జరిగింది.
- 2024 జనవరి 26న జైపూర్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మెక్రాన్‌తో ప్రధాని మోడీ చర్చలు జరిపారు. అంతరిక్ష, రక్షణ రంగాలలో పరస్పర సహకారంపై ఒప్పందాలు చేసుకున్నారు. 2026ను భారత్-ఫ్రాన్స్ సంయుక్తంగా ఆవిష్కరణల సంవత్సరంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.
- ఉగాండా రాజధాని కంపాలాలో అలీనోద్యమ సదస్సు జరిగింది. కంపాలా సదస్సులో భారత-మాల్దీవుల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. భారత విదేశాంగ మంత్రి ఎన్. జైశంకర్ మాల్దీవుల మంత్రి మూసా జమీర్ పాల్గొన్నారు.
- స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో 54వ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు జరిగింది. ఈ వేదిక ఆధ్వర్యంలో ... హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- ఏషియన్ మెడిటెక్ ఇన్నోవేషన్ సదస్సును 2024లో హైదరాబాద్‌లో నిర్వహించారు.
- పదవ వైబ్రెంట్ సదస్సు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 2024 జనవరి 10న నిర్వహించారు. దీనిలో ప్రధాని మోడీతో పాటు యూఏఈ అధ్యక్షుడు షేక్. మహ్మద్ బీన్ జయిూద్ అల్ సహ్యాన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
- చిత్తడినేలలు- జీవవైవిధ్యం పై అంతర్జాతీయ సదస్సు హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థలో జరిగింది.
- రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు రాజమహేంద్రవరంలో జరిగాయి.
- జనవరి 5-7వరకు అంతర్జాతీయ న్యూరోసైన్స్ సదస్సు హైదరాబాద్‌లో నిర్వహించారు.
- 21వ బయో ఏషియా సదస్సు హైదరాబాద్‌లో నిర్వహించారు.నోబెల్ బహుమతి గ్రహీత గ్రెగ్ సెమెంజాతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.
- కాన్‌స్టిట్యూషన్ & నేషనల్ యూనిట్ 2024 ...
- జి-20 శిఖరాగ్ర సదస్సు బ్రెజిల్‌లోని రియో డి జెనిరోలో జరిగింది.
- నదుల అనుసంధానంపై టాస్క్ ఫోర్స్ కమిటీ ఏప్రిల్ 19న న్యూఢిల్లీలో జరిగింది.
- ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశం న్యూయార్క్‌లో మార్చి 10న జరిగింది.
- నాలుగవ షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు మార్చ్ 19న న్యూఢిల్లీలో నిర్వహించారు.
- సూడాన్ కోసం అంతర్జాతీయ మానవత్వ సదస్సు ఏప్రిల్ 15న పారిస్‌లో నిర్వహించారు.
- వాతావరణ మార్పులపై నిర్వహించిన మేఘయాన్-24 సదస్సు మార్చి 28న కొచ్చిలోని సదరన్ నావెల్ కమాండ్‌లో జరిగింది.
- మొదటి భారత స్టీమ్ బాయిలర్ ఎక్స్‌పో 2024 గౌహతిలో మార్చి 7న జరిగింది.
- జియో పాలిటిక్స్, జియో ఎకనామిక్స్‌కు సంబంధించిన 9వ రైసినా డైలాగ్ న్యూఢిల్లీలో నిర్వహించారు. దీని ఇతివృత్తం చతురంగః కానిఫ్లిక్ట్, కాంటెస్ట్, కో-ఆపరేట్, క్రియేట్
- ... యాలోని పెర్త్‌లో నిర్వహించారు.
- కామన్‌వెల్త్ లీగల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (సిఎల్ఇఎ) - కామన్‌వెల్త్ అటార్నీస్ & సొలిసిటర్ జనరల్స్ కాన్ఫరెన్స్-న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్
- వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యుఇఎఫ్) 54వ సదస్సు జనవరి 05-19 దావోస్‌లో నిర్వహించారు.
- యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ 46వ వార్షిక సమావేశం 2024 జులై 21-31 వరకు న్యూఢిల్లీలో నిర్వహిస్తారు.
- 2024 ప్రపంచ ప్రభుత్వాల సమావేశం- దుబాయ్ దీని ఇతివృత్తం భవిష్యత్ ప్రభుత్వాల నిర్మితి.
- 67వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్ -లక్నో
- ఇండస్‌ఫుడ్ 2024 సమావేశం -గ్రేటర్ నోయిడా
- ఇంటర్నేషనల్ పర్పుల్ ఫెస్ట్ జనవరి 8-10 -గోవా.
- 58వ అఖిల భారత డైరెక్టర్ జనరల్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సదస్సు జనవరి 5-7వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగింది.
- యూత్ ఫర్ ఉన్నతి & వికాస్ విత్ ఏఐ సదస్సు న్యూఢిల్లీలో భారత్ మండపంలో నిర్వహించారు.

# సర్వేపల్లి నియోజకవర్గం

## ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం



తోటపల్లి గూడూరు మేజర్ న్యూస్ :తోటపల్లి గూడూరు మండలం మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని, దివంగత నటరత్న పద్మశ్రీ నందమూరి తారకరామారావు, విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ అభిమానుల ఆధ్వర్యంలో, రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో లభించిన గెలుపు అదేవిధంగా, సర్వేపల్లి నియోజకవర్గం నుంచి, అధిక మెజారిటీతో గెలుపొందిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విజయం పట్ల వారు హర్షాతిరేకం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాల వేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడుస్తుందని, వారు ఆశాభావం వ్యక్తం చేశారు, అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు, ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ తెలుగుదేశం వీరాభిమాని పూనమల్లి రామారావు, పూనమల్లి వెంకయ్య, జోగి సుబ్బయ్య, బందెల రాజేష్, మలిశెట్టి సుబ్రహ్మణ్యం, బోడపల్లి శ్రీనివాసులు,తదితర తెలుగుదేశం అభిమానులు పాల్గొన్నారు.

## దేవర దిబ్బ గిరిజన బాధితులకు జనసేన పరామర్శ.



ముత్తుకూరు జూన్ 7( మేజర్ న్యూస్) పైన పురం గ్రామ పంచాయతీ పరిధిలో దేవర దిబ్బ గ్రామ సమీపాన ఉన్నటువంటి బూడిద కాలుష్యం వల్ల వాంతులు, విరోచనాలతో హాస్పిటల్ పాలైన గిరిజన సంఘం బాధితులను నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు బొబ్బేపల్లి సురేష్ బాబు పరామర్శించారు. ప్రైవేట్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న వారిని గురువారం ఆయన కలసి పరామర్శించి ఆరోగ్య విషయాలపై అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని తమ వంతు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా బాధితులు కు అవసరమైన కొబ్బరి నీళ్లు, ఇతర ఇతర పదార్థాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తక్షణమే స్పందించి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని జనసేన పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు తదితరులు ఉన్నారు.

# ఎస్ఈఐఎల్ ఎనర్జీ మెగా ప్లాంటేషన్ డ్రైవ్.




ముత్తుకూరు, జూన్ 7 ( మేజర్ న్యూస్) ఎస్ ఈ ఐ ఎల్ ఎనర్జీమెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా గురువారం అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి దారులైన( ఐపిపి )ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ముసునూరు వారి పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రాజెక్ట్ యాజమాన్యం ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి సిహెచ్ రాజశేఖర్ విచ్చేశారు. ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ హెడ్ సునీల్ కుమార్ గుప్తా కూడా హాజరయ్యారు. ప్రాజెక్ట్ హెచ్ఓడీలు, ఉద్యోగులు, పాఠశాలఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఉత్తమ ప్రమాణాలను అనుసరించడం వివిధ పర్యావరణ అనుకూల కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రాంతంలో అతి తక్కువ కార్బన్ ఉద్గారాలతో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఆదర్శంగా కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారి తెలిపారు. ప్రాజెక్ట్ సీఈఓరాఘవ్ త్రివేది మాట్లాడారు. ఈ కార్యక్రమం నిర్వహించడంలో బృందం చేసిన కృషిని అభినందించారు. మేము పర్యావరణ స్థిరత్వానికి కట్టుబడి ఉన్నామన్నారు. సామూహిక మొక్కల పెంపకం ద్వారా డీకార్బనైజేషన్ కార్యకలాపాలతో సహా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా స్థిరమైన భవిష్యత్తు కోసం ప్రకృతి , సమాజానికి తోడ్పాటు అందిస్తామన్నారు. పర్యావరణ సుస్థిరత , జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి, ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ తన కార్యకలాపాల ప్రాంతాలలో, చుట్టుపక్కల గ్రీన్‌బెల్ట్‌లను అభివృద్ధి చేసిందని సీఈఓ అన్నారు. గత పది సంవత్సరాల లో ప్రాజెక్టు యాజమాన్యం 11 లక్షలకు పైగా మొక్కలను నాటినట్లు తెలిపారు. వృక్షజాలం, జంతుజాలానికి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు కృషి చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఫలితంగా వలస వచ్చిన వాటితో సహా 20 కంటే ఎక్కువ విభిన్నమైన పక్షి జాతులు సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ జనరేషన్ కాంప్లెక్స్‌లోని బూడిద-చెరువులు ఇతర నీటి వనరులను క్రమం తప్పకుండా సందర్శిస్తున్నాయని తెలిపారు.

# ఎమ్మెల్యే సోమిరెడ్డికి తెలుగు యువత ఉపాధ్యక్షులు శ్రీనాథ్ శుభాకాంక్షలు.



ముత్తుకూరు జూన్ 7 (మేజర్ న్యూస్) సర్వేపల్లి శాసన సభ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని గురువారం తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు యువత కమిటీ ఉపాధ్యక్షులు తుమ్మల శ్రీనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో ఆయన విజయం సాధించగా కలసి శుభాకాంక్షలు చెప్పడం జరిగింది. పుష్ప గుచ్చాలు అందజేసి సాలువా కప్పి సన్మానించారు. రాష్ట్ర మంత్రిగా పదవి బాధ్యతలు రావాలని ఆకాంక్షించారు. తెలుగు యువత ఉపాధ్యక్షులు అభిమానం పట్ల సోమిరెడ్డి సంతోషంగా వ్యక్తం చేశారు

# ప్రణాళికబద్ధంగా నెల్లూరు నగరం డెవలప్‌మెంట్





**- తిరుగులేని విజయాన్ని ఇచ్చిన ప్రజలకు... మరచిపోలేని అభివృద్ధి ఇస్తాం**

**- నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పొంగూరు నారాయణ**

**- యూత్, మహిళా టీమ్‌లు, టీడీపీ ముఖ్యనేతలతో సమీక్ష**

నెల్లూరు సిటీ (మేజర్ న్యూస్)విశేష ఆధరణతో తిరుగులేని విజయాన్ని అందించిన నెల్లూరు నగర ప్రజల రుణాన్ని తీర్చుకునేందుకు ఓ ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లేందుకు సంసిద్ధమైనట్లు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నెల్లూరు గోమతినగర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం సాయంత్రం రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాలు మధు, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ విజేత రెడ్డి, నారాయణ విద్యాసంస్థ జీఎం విజయభాస్కర్‌రెడ్డి, తదితర ముఖ్యనేతల ఆధ్వర్యంలో యూత్ టీమ్, మహిళా టీమ్, టీడీపీ శ్రేణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. యూత్ టీమ్, మహిళా టీమ్, టీడీపీ ముఖ్యనేతలకు డాక్టర్ పొంగూరు నారాయణ దిశానిర్దేశం చేశారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన నెల్లూరు నగర ప్రజలు మరచిపోలేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మేలు చేయాలని ప్రణాళికలు చేశారు.

## చేపలకు కోళ్ల వ్యర్థాలు..... పట్టించుకోని అధికారులు.

**-ఈ చేపలు తింటే క్యాన్సర్లు**

**- మామూళ్లు మత్తులో మత్స్యశాఖ**

**-దారి పొడవున దుర్గంధం**







**బుచ్చి రెడ్డి పాలెం (మేజర్ న్యూస్ )** మామూళ్ళ మత్తులో మత్స్యశాఖ కళ్ళు మూసుకోవడం ప్రజల పాలిట శాపం గా మారి పోయింది. కోళ్ల వ్యర్థాలు తినే చేపలు తింటే క్యాన్సర్ వ్యాధి వస్తుందని ప్రముఖ వైద్యులు చెబుతున్న మత్స్య శాఖ తమకు నెల మామూళ్లు వస్తే చాలు ప్రజలు ఎలా పోతే తమకు ఎందుకు అంటూ వ్యవహరిస్తున్న వైనమిది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా లోని పలు మండలాలలో మంచి నీటి చేపలకు కోళ్ల వ్యర్థాలు వేయడం జరుగుతుంది. మంచి నీటి చేపల పెంపు కోసం రైతులు వాటికి తవుడు, పౌష్టికహారం వేయాల్సిఉంది. వీటి రేటు అధికం కావడం తో చేపల రైతులు కోళ్ల వ్యర్థాల పై ఆధారపడుతున్నారు.

**చేపలు తింటే క్యాన్సర్లు.......**

కోళ్ల వ్యర్థాలను తిని పెరిగిన మంచి నీటి చేపలు తింటే క్యాన్సర్ వ్యాధి తో పాటు కిడ్నీ, లివర్, వ్యాధులు వస్తాయని ఆరోగ్య శాస్త్ర వేత్తలు చెబుతున్నారు. దీనిపై అవగాహన లేని ప్రజలు వాటిని తిని అనారోగ్యం పాలవుతున్నారు. కోళ్ల వ్యాపారులు కోళ్ల ను చంపి మాంసం తీసుకొని మిగిలిన వ్యర్థలను డమ్ము లో వేసి మరగ బెట్టి అమ్ముతున్నారు. వీటిని చేపల రైతులు కొనుగోలు చేసి మంచి నీటి చేపల గుంటల్లో వేస్తున్నారు. వీటిని చేపలు తినడం వలన వాటి మాంసం తింటే రోగాలు వస్తాయని తెలిసిన కూడా గుట్టు చప్పుడు కాకుండా వాటిని ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

**మాముళ్ళ మత్తులో మత్స్య శాఖ.......**

మంచి నీటి చేపల గుంటల్లో కోళ్ల వ్యర్థాలు వేయడం నిషేధం. వాటి పై మత్స్య శాఖ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ చేపల గుంటల రైతులు మత్స్య శాఖ లోని పై అధికారుల నుంచి కింది స్థాయి అధికారుల వరకు నెల మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం. ఈ మామూళ్ళ మత్తులో మత్స్య శాఖ అధికారులు చేపల గుంటలు వైపు వెళ్లడం మానివేశారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం, సంగం మండలాల్లో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా కనిపిస్తుంది. దీని పై మత్స్య శాఖ కు ఎన్నో పిర్యాదు లు వెళ్లిన వాటిని అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**దారిపొడవున దుర్గంధం..........**

ఈ కోళ్ల వ్యర్థాలను నెల్లూరు పట్టణం నుంచే కాకుండా, చెన్నై, బెంగుళూరు లాంటి నగరాలు నుంచి కూడా తీసుకొని వస్తున్నారు. ఈ వ్యర్థాలు తీసుకొని వెళ్లే వాహనాలు రోడ్డు మీద వెళ్ళుతుంటే ఐదు నిముషాలు పాటు ప్రజలు ముక్కులు మూసుకోవాల్సిందే. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సందర్భం లో కూడా చెక్ పోస్ట్ ల నుంచి ఈ దుర్గంధం వాహనాలు వెళుతున్న కూడా ఎవ్వరు పట్టించుకోవడం లేదు. గతం లో బుచ్చిరెడ్డి పాలెం మండలం కాగులపాడు గ్రామం లో ని ప్రజలు ఈ వ్యర్థాల దుర్గంధం తట్టుకోలేక వాహనాలను పట్టుకుని మత్స్య శాఖ కు పిర్యాదు చేస్తే వారు వచ్చి ఇంక మీదట వేయరులే అని సర్ది చెప్పి పంపిన సంఘటనలు కూడా ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఈ వ్యర్థాల పై చొరవ తీసుకొని ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు.

# జిల్లాలో ముగిసిన ఎన్నికల కోడ్

**-అందరి సహకారంతో విజయవంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి.**

**-అధికారులు, సిబ్బంది,ప్రజలకు రాజకీయపార్టీల ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు**

**-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్**



**నెల్లూరు, (మేజర్ న్యూస్)**2024 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగియడంతో గురువారం సాయంత్రం జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరినారాయణన్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన రిటర్నింగ్ అధికారులకు,ప్రజలు, అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ధన్యవాదములు తెలుపుతూ కలెక్టర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు మార్చి 16న జిల్లాలో అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్ గురువారం ముగిసిందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో సుదీర్ఘంగా 82 రోజుల పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. నెల్లూరు నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లో జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వివిధ బృందాలను నియమించి ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పర్యవేక్షించినట్లు కలెక్టర్ చెప్పారు. మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా పూర్తికాగా, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ కూడా విజయవంతంగా పూర్తయినట్లు కలెక్టర్ చెప్పారు. ఎక్కడా కూడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా, శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంల పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసి శాంతి భద్రతలు కాపాడిన పోలీస్ శాఖకు,ప్రింట్,ఈలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సిబ్బందికి శిక్షణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరుజాబితా తయారీ, ఓటరు స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, ఓటు ఆవశ్యకత, వినియోగంపై అవగాహన కార్యక్రమాలు, వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్ద ఓటు వినియోగం, పోస్టల్ బ్యాలెట్ల ఓట్లు వినియోగం మొదల్కైన అన్ని ఎన్నికల ప్రక్రియలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పక్కా కార్యాచరణతో జిల్లా యంత్రాంగం పూర్తి చేసినట్లు చెప్పారు. అధికారులు, సిబ్బంది, ప్రజలు,రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో 2024 సార్వత్రిక ఎన్నికల ప్రకియను విజయవంతంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో పెద్దఎత్తున ఓట్లు వేసి ఎన్నికల పర్వం- దేశానికి గర్వం అనే నినాదాన్ని నిజం చేస్తూ ప్రజాస్వామ్య గౌరవాన్ని ఇనుమడింపజేసిన జిల్లా ప్రజానీకానికి కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు, జిల్లా యంత్రాంగం, రాజకీయపార్టీల ప్రతినిధులు అందించిన సహకారానికి కలెక్టర్ ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మూత్రం పసుపు రంగులోకి వస్తుందా..... కిడ్నీలను ఇలా కాపాడుకోండి..



**నెల్లూరు (మేజర్ న్యూస్ )** కిడ్నీలు శరీరంలో చాలా ముఖ్యమైన అవయవాలు. ఇది రక్తం నుండి మురికి, అదనపు ద్రవాలను ఫిల్టర్ చేయడానికి పనిచేస్తుంది. అదనంగా ఇది శరీరంలో ఎలక్ట్రోలైట్ల సమతుల్యతను నిర్వహిస్తుంది.**రక్తపోటు, ఎర్ర రక్త కణాలను నియంత్రించే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది.**
మూత్ర పిండాల సమస్య ఉన్నవారికి ఎక్కువగా వికారం, వాంతులు, కండరాల తిమ్మిరి, ఆకలి లేకపోవడం, పాదాలు, చీలమండలలో వాపు, పొడి దురద చర్మం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నిద్రపోవడంలో ఇబ్బంది, ఎక్కువ లేదా చాలా తక్కువ మూత్రవిసర్జన, వంటి లక్షణాలు, పసుపు మూత్రం వచ్చినట్టు అనిపిస్తుంది.

**మూత్రపిండాలను ఎలా శుభ్రం చేయాలి....?**

మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం మొత్తం శరీరానికి అవసరం. మీరు మీ డైట్ లో మూత్రపిండాలను శుభ్రపరిచే ఆహారాలను చేర్చుకోవచ్చు. వీటిని తీసుకోవడం వల్ల మూత్రపిండాల పనితీరు మెరుగుపడుతుంది. శరీరంలోని విష పదార్థాలు బయటకు వస్తూ ఉంటాయి.

**కూరగాయలు.....**

ప్రకారం క్యాబేజీ, కాలీఫ్లవర్, బ్రోకలీ, బ్రస్సెల్స్ మొలకలు వంటి క్రూసిఫెరస్ కూరగాయలు శరీరం నుండి విషాన్ని తొలగించి మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడే సమ్మేళనాలను కలిగి ఉంటాయి. ఈ కూరగాయలలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరం నుండి తొలగించడంలో సహాయపడతాయి. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి సహాయపడతాయి. మీరు సలాడ్, కూరగాయలు లేదా కాల్చిన కూరగాయల మిశ్రమంలో మీ ఆహారంలో క్రూసిఫెరస్ కూరగాయలను చేర్చవచ్చు.

**బెర్రీలు.....**

స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, రాస్ప్బెర్రీస్, క్రాన్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మూత్రపిండాల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఈ పండ్లు వాపును తగ్గిస్తాయి. కిడ్నీ కణజాలానికి హాని కలిగించే ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తాయి. మీరు బెర్రీలను స్నాక్‌గా, స్మూతీస్‌లో లేదా సలాడ్‌లు, ఓట్‌మీల్‌లో జోడించి తినవచ్చు.

**పచ్చని ఆకు కూరలు.....**

బచ్చలికూర, కాలే, స్విస్ చార్డ్ వంటి ఆకుకూరలు విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్ల నిధి. ఇవి మూత్రపిండాల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అదనంగా వాటిలో తక్కువ మొత్తంలో పొటాషియం కూడా ఉంటుంది. ఇది మూత్రపిండాల వ్యాధి ఉన్నవారికి మంచిది. మీరు సలాడ్, సూప్, కూర లేదా స్మూతీలో ఆకుపచ్చ కూరగాయలను చేర్చవచ్చు.

**ఆమ్ల ఫలాలు.....**

నారింజ, నిమ్మ, ద్రాక్షపండు, ద్రాక్షపండు వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి, సిట్రేట్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా నిరోధించడంలో సహాయపడతాయి. సిట్రస్ పండ్లు మూత్రం మొత్తం, ఆమ్లతను కూడా పెంచుతాయి. ఇది రాళ్ళు ఏర్పడే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మీరు సిట్రస్ పండ్లను తాజా పండ్లుగా లేదా వాటిని నీటిలో కలపడం ద్వారా తినవచ్చు.

**వెల్లుల్లి.....**

వెల్లుల్లి దాని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇది మూత్రపిండాల నష్టం, ఇన్ఫెక్షన్ నుండి రక్షించడంలో సహాయపడుతుంది. శరీరం నుండి విషాన్ని తొలగించే ప్రక్రియను వేగవంతం చేసే సల్ఫర్ మూలకాలు కూడా ఇందులో ఉన్నాయి. రుచి, ఆరోగ్య ప్రయోజనాల కోసం, మీరు తాజా వెల్లుల్లిని సూప్‌లు, సాస్‌లు లేదా కాల్చిన కూరగాయలలో ఉపయోగించవచ్చు.

**పసుపు.....**

పసుపు అనేది యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉన్న మసాలా, ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పసుపులో ఉండే ప్రధాన మూలకం కర్కుమిన్, కిడ్నీలను గాయం నుండి రక్షించడంలో, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. మీరు పసుపును కూరలు, సూప్‌లు, స్మూతీస్ లేదా బంగారు పాలలో ఉపయోగించవచ్చు.

**గింజలు, విత్తనాలు....**

బాదం, వాల్‌నట్స్, చియా గింజలు, అవిసె గింజలు వంటి గింజలు ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, ఫైబర్‌లను కలిగి ఉంటాయి. ఇవి మూత్రపిండాల ఆరోగ్యానికి, శరీరం నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడతాయి. అదనంగా అవి మూత్రపిండాల పనితీరుకు ముఖ్యమైన మెగ్నీషియం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలను కూడా కలిగి ఉంటాయి. మీరు గింజలను చిరుతిండిగా తినవచ్చు. వాటిని సలాడ్ లేదా పెరుగులో చేర్చవచ్చు లేదా ఇంట్లో తయారుచేసిన గ్రానోలా లేదా ఎనర్జీ బార్‌లలో వాటిని ఉపయోగించవచ్చు.

**నీళ్లు......**

మూత్రపిండాలకు నీరు అత్యంత ముఖ్యమైన విషయం. ఇది శరీరం నుండి టాక్సిన్స్, మురికిని తొలగించడంలో సహాయపడుతుంది. తగినంత నీరు త్రాగడం వల్ల మూత్రపిండాలు బాగా పని చేస్తాయి. కిడ్నీలో స్టోన్ ఏర్పడే అవకాశాలు కూడా తగ్గుతాయి. రోజుకు కనీసం ఎనిమిది గ్లాసుల నీరు త్రాగడానికి ప్రయత్నించండి. వేసవిలో లేదా శారీరక శ్రమ తర్వాత మీరు త్రాగే నీటి పరిమాణాన్ని పెంచండి. గమనిక: ఈ కథనం సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏదైనా ఔషధం లేదా చికిత్సకు ఏ విధంగానూ ప్రత్యామ్నాయం కాదు. మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.